క్లుప్తంగా

ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినోద్

సీతానగరం: మండలంలోని వంగలపూడి రేవు నుంచి పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వెళ్లి, తిరిగి వస్తున్న యువకుడికి ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రగాయమైంది. వివరాల్లోకి వెళితే.. రాజానగరానికి చెందిన 25 ఏళ్ల ఎం.వినోద్ గురువారం తెల్లవారుజాము 2.30 గంటలకు పట్టిసీమ నుంచి వంగలపూడి రేవుకు ట్రాక్టర్‌పై తిరిగి వస్తున్నాడు. తన ఐదుగురి స్నేహితులతో పాటుగా ట్రాక్టర్ ట్రక్కు శివారున కూర్చున్నాడు. ఆ సమయంలో ఎదురుగా వచ్చిన మరో ట్రాక్టర్ వీరి ట్రక్కును రాసుకుంటూ వెళ్లిపోయింది. రెండింటి మధ్య వినోద్ కాలు చిక్కుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎడమ కాలు మడం పైభాగంలో ఎముక బయటకు వచ్చింది. అదే ట్రక్కుపై ఉన్న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడుకు చెందిన ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ లక్ష్మణ్.. బాధితులకు ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరంలోని ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. ఆ ఆస్పత్రిలోనే ల్యాబ్ టెక్నీషియన్ వినోద్ పనిచేస్తున్నాడు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



సీతానగరం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రామచంద్రపురానికి చెందిన పిర్ల వెంకటేశ్వర్లు (గణేష్ యాదవ్) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి చేతుల మీదుగా గురువారం ఆయన నియామక పత్రం అందుకున్నాడు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మధురపూడి: కోరుకొండ సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో, కోరుకొండ, ఫిల్మ్‌నగర్ ప్రాంతాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థల కృషి అమూల్యం



స్వర్ణాంధ్ర సంస్థలో కేక్ కట్ చేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో పౌరుల తక్షణ అవసరాలు తీర్చడానికి స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న కృషి అమూల్యమైనదని స్వర్ణాంధ్ర సేవా సంస్థ ముఖ్య నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. అంతర్జాతీయ ఎన్జీవో దినోత్సవం సందర్భంగా గురువారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సుమారు 40 స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల మధ్య పరిచయం, సమన్వయం సాధించడం కోసం పూర్వపు ఉభయ జిల్లాల స్వచ్ఛంద సేవా సంస్థలతో ఒక డైరెక్టరీని రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనూప్, జోషి బాబు, ప్రభుదాస్, పోసి కుమార్, మద్దాల అను, రాజయోనా, శకుంతల, లక్ష్మణరావు, రుద్రమదేవి, సురేష్, కుసుమ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్ల వెంకన్న నర్సరీ సందర్శన


ఆదాయపు పన్ను అధికారి రాజేంద్ర కుమార్‌కు మొక్కల ప్రత్యేకతను వివరిస్తున్న రైతులు

కడియం: స్థానిక పల్ల వెంకన్న నర్సరీని ఇన్‌కం ట్యాక్స్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర కుమార్ గురువారం సందర్శించారు. ఆయనకు నర్సరీ రైతులు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్ ఘనంగా స్వాగతం పలికి, వివిధ రకాల మొక్కలను వివరించారు. ఆయన వెంట ఐటీ సెంట్రల్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ సవీష్ వర్మ, కేంద్ర అధికారులు కల్యాణ చక్రవర్తి, ఎల్.రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

తెలుగు పాఠాలపై పట్టుండాలి



తెలుగు పరీక్షకు సంబంధించి పద్యం, గద్యం, ఉపవాచకాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. కరపత్రం, లేఖ, సంభాషణలో ఏదో ఒక అంశంపై నాలుగు ప్రశ్నలు ఇస్తారు. అలంకారాలు, చందస్సు అర్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి – వికృతులు, నానార్థాలు, జాతీయాలు వంటి భాషాంశాలపై 22 నుంచి 32 వరకూ ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న – జవాబులతో పాటు గ్రామర్ (భాషాంశాలు)పై కూడా పట్టు సాధించాలి.

– గోవర్ధనం వెంకట రంగనాథ్, తెలుగు ఉపాధ్యాయుడు, బిక్కవోలు

హిందీపై అవగాహన అవసరం



హిందీ పరీక్షలో భాగం–1 వ్యాకరణాంశాలకు సంబంధించి ఉంటుంది. జవాబులు ప్రశ్నాపత్రంలోనే ఉంటాయి. భాగం–2 పద్య భాగానికి సంబంధించింది. రెండు పేరాగ్రాఫ్‌లు ఉండి, వాటి కింద ప్రశ్నలు అడుగుతారు. భాగం–3లో కవి పరిచయాలు, భాగం–4లో ప్రశ్నోత్తరాలు రాయాలి. 5లో పద్యానికి సంబంధించిన సారాంశం, 6లో గద్య భాగం నుంచి సారాంశం రాయాల్సి ఉంటుంది.

– పడాల సత్యనారాయణరెడ్డి, హిందీ ఉపాధ్యాయుడు, పందలపాక

ఇంగ్లిష్ గ్రామర్‌కు ప్రాధాన్యం



ఇంగ్లిష్ ప్రశ్నాపత్రం మూడు విభాగాలుగా ఉంటుంది. 30 మార్కులకు బహుళైచ్ఛిక ప్రశ్నలు, 6 మార్కులకు సాధారణ ప్రశ్నలు ఉంటాయి. రీడింగ్ పేరాగ్రాఫ్ ద్వారా 24 మార్కుల వరకు స్కోరింగ్ చేసుకోవచ్చు. గ్రామర్, ఒకాబులరీ బాగా సాధన చేయాలి. గ్రామర్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తే 40 మార్కులకు 25 సులభంగా పొందవచ్చు. లెటర్ రైటింగ్‌కు సంబంధించిన అంశాలపై పట్టు పెంచుకోవాలి.

– వైవీఎస్ ఆచార్యులు, ఇంగ్లిష్ పండిట్, అనపర్తి

ప్రణాళికతో విజయం పదిలం

- పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు
- ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం ఖాయం

బిక్కవోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. జీవితంలో అత్యంత ముఖ్యమైన ఈ మలుపును విజయవంతంగా దాటాలని విద్యార్థులు కోరుకుంటారు. పదిలో సాధించిన మార్కులే ఉన్నత విద్య, ఉద్యోగాల సాధనకు కీలకమవుతాయి. ఈ నేపథ్యంలో మంచి మార్కుల సాధనకు విషయ (సబ్జెక్టు) నిపుణులు సలహాలు, సూచనలిస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో వంద శాతం మార్కులు సాధించాలంటే చక్కని ప్రణాళిక అవలంబించాలంటున్నారు. అనపర్తి నియోజకవర్గంలో 39 ఉన్నత పాఠశాలలో 2,796 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలో మంచి మార్కులు సాధించడానికి పలువురు ఉపాధ్యాయులు ఎంతో విలువైన అంశాలను తెలియజేశారు.


కొంకుదురులో పదో తరగతి విద్యార్థుల సాధన

గణితంలో వంద మార్కులు పక్కా



వంద మార్కులు సాధించేందుకు అవకాశం ఉన్న ఏకైక సబ్జెక్టు గణితం. ప్రతి చాప్టర్‌ను బాగా అధ్యయనం చేసి, లెక్కలు చక్కగా ప్రాక్టీస్ చేస్తే మంచి మార్కులు వస్తాయి. వాస్తవ సంఖ్యలు, బహుపదులు, సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత, రేఖీయ సమీకరణాలు, నిరూపక రేఖా గణితం, త్రికోణమితి, త్రికోణమితి అనువర్తనాల బాగా సాధన చేయాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది.

– పడాల ఈశ్వర్ రెడ్డి, గణిత ఉపాధ్యాయుడు, కొంకుదురు

పటాలను సాధన చేయాలి



జీవశాస్త్రానికి సంబంధించి 12వ ప్రశ్నలో ఇచ్చే పటాలను బాగా సాధన చేయాలి. 13వ ప్రశ్న చివరి పాఠం నుంచి ఇచ్చే అవకాశం ఉంది. ఫ్లోచార్టులను బాగా పరిశీలించాలి. తద్వారా వాటిపై వచ్చే ప్రశ్నలకు జవాబులు సులభంగా రాయగలుగుతారు. పాఠ్యపుస్తకంలో ఇచ్చిన వివిధ పట్టికలను అవగాహన చేసుకోవడం ద్వారా 14వ ప్రశ్నకు జవాబులు సునాయాసంగా రాస్తారు.

– కుంభంపాటి అప్పారావు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, కొంకుదురు

ఫిజిక్స్‌లో మార్కులు సులభమే



భౌతిక శాస్త్రం (ఫిజిక్స్)లోనూ మంచి మార్కులు సాధించడం సులభమే. కృత్యాలు రాయడం, ప్రశ్నించడం, కారణాలు తెలపడం, ఉపయోగాలు చెప్పడం, ప్రమాణాలు రాయడం, పటాలు గీయడం తదితర వాటిని ప్రాక్టీస్ చేస్తే నూరు శాతం మార్కులు తెచ్చుకోవచ్చు, రసాయనిక చర్యల సమీకరణాలు, ఆమ్లాలు– క్షారాలు, కార్బన్ – దాని సమ్మేళనాలు, మానవుని కన్ను – రంగుల ప్రపంచం, కాంతి పరావర్తనం వంటి అంశాలు చదివితే మంచి మార్కులు వస్తాయి.

– వరికూటి శ్రీనివాసులు రెడ్డి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, పందలపాక

పరోక్ష పద్ధతిలో ప్రశ్నలు



సాంఘిక శాస్త్రం (సోషల్) పరీక్షలో ప్రశ్నలన్నీ పాఠ్యపుస్తకాల్లో ఉన్న మాదిరిగా రావు. పరోక్ష పద్ధతిలో వచ్చే అవకాశం ఉంది. 4, 8 మార్కుల జవాబులు రాసేటప్పుడు ఉపశీర్షికలతో అంశాల వారీగా రాయాలి. మధ్యలో ప్రధానాంశాలుంటే అండర్‌లైన్ చేయాలి. 8 మార్కుల ప్రశ్నలకు సమాధానాలు పెద్దగా ఉన్నాయని భయపడాల్సిన అవసరం లేదు. సమాచారం నైపుణ్యానికి 15 మార్కులు కేటాయించారు. మ్యాపులు గుర్తించడం కూడా సులువే.

– గొలుగూరి వెంకటరామారెడ్డి, సోషల్ ఉపాధ్యాయుడు, ఊలపల్లి

వైభవంగా కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి కనకదుర్గమ్మ

రంగంపేట: చండ్రేడు గ్రామంలోని శ్రీదేవి కనకదుర్గమ్మ వార్షిక తీర్థ మహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు దండలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు


రంగంపేటలో కొలువైన దత్త సాయిబాబా

రంగంపేట: పెద రాయవరం గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకున్నారు. రంగంపేటలోని దత్తసాయి మందిరంలోనూ పూజలు జరిగాయి.

ఘనంగా చంద్రశేఖరస్వామి కల్యాణం

రంగంపేట: చండ్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం బుధవారం రాత్రి అంగరంగం వైభవంగా జరిగింది. అర్చకుడు మునుకుట్ల శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు హాజరయ్యారు. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్


రాజానగరంలోని ఒక పోలింగ్ బూత్ వద్ద మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో లైన్‌లో ఉన్న ఓటర్లు


బిక్కవోలు పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల క్యూ

రాజానగరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. రాజానగరం నియోజకవర్గంలో 5,844 మంది పట్టభద్రులన ఓటర్లకు 3926 మంది (67.18 శాతం) ఓటుహక్కును వినియోగించుకున్నారు. 1,918 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. మండలాల వారీగా రాజానగరంలో 2522 మందికి 1,582 మంది (62.73 శాతం), కోరుకొండలో 1819 మందికి, 1277మంది (70 శాతం), సీతానగరంలో 1516 మందికి, 1067 మంది (70.38 శాతం) ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఓటర్ల సంఖ్యను బట్టి ముందుగా ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసిన అధికారులు కోరుకొండలో 49వ నంబరు కేంద్రంలో ఓటర్లు ఎక్కువగా ఉండటంతో పక్కనే సబ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పోలింగ్ కేంద్రాల సంఖ్య ఎనిమిదికి పెరిగింది.

పెదపూడి మండలంలో..

పెదపూడి: మండలంలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎన్నికల మండల సెక్టోరియల్ అధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. మొత్తం 2,489 మంది ఓటర్లకు 1702 మంది (68 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. పెదపూడిలో రెండు, జి.మామిడాడలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. రూట్ ఆఫీసర్‌గా ఎస్.కనక నాగేంద్ర కుమార్ వ్యవవరించారు. కాగా. మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సందర్శించారు. ఆయన వెంట ఎన్డీఏ నాయకులు ఉన్నారు.


పెదపూడి పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు

81.14 శాతం పోలింగ్

రంగంపేట: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఏఈఆర్ఓ, తహసీల్దార్ కోసు అనసూయ తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయితీల పరిధిలో మొత్తం 1,289 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. వారి కోసం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 1,046 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 81.14 శాతం ఓటింగ్ నమోదైందన్నారు.

మందకొడిగా

బిక్కవోలు: మండలంలోని మూడు పోలింగ్ కేంద్రాలలో 66.34 శాతం ఓటర్లు నమోదు అయినట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. బ్యాలెట్ పెద్దదిగా ఉండడంతో ఒక్కో ఓటరుకు కనీసం 5 నుంచి 10 నిమిషాలు సమయం పట్టేది. దీంతో క్యూలో నిలబడలేక కొందరు వెనక్కు వెళ్లిపోయారు.

వందేళ్ల సేవలకు ఇక సెలవ్..

- కోరుకొండలో కనుమరుగు కానున్న నిద్రగన్నేరు చెట్టు
- త్వరలో తొలగించనున్న సిబ్బంది

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్ సమీపంలోని నిద్రగన్నేరు చెట్టు వయసు దాదాపు వందేళ్లకు పైబడే ఉంటుంది. ఇప్పటి వరకూ ఎందరికో నీడనిచ్చింది. ప్రజలకు అవసరమైన ఆక్సిజన్‌ను అందజేసింది. తన కింద సేదతీరే వారికి చక్కటి గాలిని అందించింది. వయసు పెరిగిపోవడంతో ప్రస్తుతం ఎండిపోయింది. దీంతో దాన్ని తొలగించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మార్చి 9వ తేదీ నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ పనుల్లో భాగంగా వందేళ్ల పైబడి చరిత్ర ఉన్న నిద్రగన్నేరు చెట్టును తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. నరసన్న ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తారు. వారితో పాటు స్థానికులకు ఈ ఎండిన చెట్టు వల్ల ఎటువంటి ప్రమాదం జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే చెట్టును నరికివేయకుండా, కొమ్మలను తొలగించి, దానికి పునరుజ్జీవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.


కోరుకొండలో ఎండిపోయిన నిద్రగన్నేరు చెట్టు

వైభవంగా శివపార్వతుల రథోత్సవం

సీటీఆర్ఐ: గోదావరి గట్టున గల ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ముగింపు వేడుకలలో భాగంగా గురువారం సాయంత్రం శివపార్వతుల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రాజబాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తుల హరహర మహాదేవ, శంభో శంకర అనే నినాదాల మధ్య భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన పూజారి నీలకంఠశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ రెడ్డిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీలో నూతనంగా పదవులు చేపట్టిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయనను నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన పడాల దుర్గాప్రసాద్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు గొలుగూరు అబ్బు, వంక శ్రీను, మచ్చా రాజు, గండి వాసు, పడాల వీర రాఘవరెడ్డి, గొల్త్రిపల్లి గణపతి తదితరులు పాల్గొన్నారు.

శిబిరాల్లో పలువురికి వైద్యసేవలు

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని షిర్డీ సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. మందిరం సమీపంలోని ద్వారకామాయి ఫంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి సెంటెన్నియల్ పవర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సాధారణ శిబిరంలో రాజమహేంద్రవరం గంగా ఎమర్జెన్సీ, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు పీఎస్‌వీటీఆర్‌కే పరమహంస, సత్యం రమేష్ బాబు 51 మందికి వైద్యసేవలు అందించారు. పలువురికి ఈసీజీ తీశారు. షుగర్, బీపీ, ఇతర వ్యాధులకు పరీక్షలు జరిపారు. అలాగే ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ అనుబంధంగా ఉన్న జగ్గంపేటలోని శ్రీమతి రాజరాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ వైద్యశాల వారి నేత్ర శిబిరంలో 30 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో ఐదుగురికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచిత ఆపరేషన్లు చేయడానికి తరలించారు. కళ్లజోళ్లు అవసరమైన 14 మందికి ఉచితంగా అందించనున్నారు. కార్యక్రమంలో కొల్లూరి గోపాలకృష్ణ, నరసింహారావు, వెంకటేశ్వరరావు, శ్రీసాయి సేవాసమితి ఇనుగంటివారిపేట చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్, సత్యం మోహనరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


ఇనుగంటివారిపేటలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి


ఎస్పీని కలిసేందుకు వెళుతున్న భారతానంద్ మహారాజ్, ఇతర గోరక్షకులు

కంబాలచెరువు: గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని భారత్ శక్తిపీఠం అధ్యక్షుడు, హిందూ మహా సభ దక్షిణ భారత ఆర్గనైజింగ్ సెక్రటరీ భారతానంద్ మహారాజ్ అన్నారు. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వచ్చిన ఆయన గోవుల అక్రమ రవాణాపై గురువారం జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాను పోలీస్ శాఖ వారే ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పశువుల అక్రమ రవాణా చేస్తున్న నిందితులకు రాజానగరం పోలీసులు సహకారం అందిస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ గోహత్య నిషేధ చట్టం, జంతు సంరక్షణ చట్టం 1970 ప్రకారం రాజానగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న గోవుల అక్రమ రవాణా జరుగుతున్న సంఘటనపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించామన్నారు. అయితే ఈ నెల 26వ తేదీన ఒక కంటైనర్‌లో సుమారు 40 వరకు ఆవులను ఇరికించి రవాణా చేస్తున్నారన్నారు. ఆ వాహనాన్ని హిందూ గో సేవా సమితి సభ్యుడు, గోశాల నిర్వాహకుడు మోటుపల్లి సాయి.. తమ గ్రూపులో రాబడిన సమాచారం మేరకు 112 కాల్ చేసి పోలీసు వారి సహకారంతో ఆవుల అక్రమ రవాణాను అడ్డుకొని పోలీసులకు అప్పగించాడన్నారు. అయితే రాజానగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంటనే వాహనాన్ని స్టేషన్‌కు తరలించకుండా రోడ్డుమీద ఆపి మాఫియాకు అనుగుణంగా మాట్లాడారని ఆరోపించారు. మాఫియాకి సహాయం చేసి ఆ వాహనాన్ని విడిచి పెట్టినందుకు సీఐను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అమ్మానాన్న సేవా సమితి సంస్థ నెల్లూరు కావలికి చెందిన మంగళగిరి వేణుగోపాలరావు, సాధువులు, సన్యాసులు పాల్గొన్నారు.

హండ్రెడ్ ఫీట్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని హండ్రెడ్ ఫీట్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలతో ఎస్‌వీ జనరల్ మార్కెట్ వ్యాపారులతో పాటు లారీ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డులో ఉదయం 9 నుంచి రాత్రి పది గంటల వరకూ ఎస్‌వీ మార్కెట్‌లోకి వచ్చే లారీలకు అనుమతి లేదంటూ గురువారం ఉదయం ట్రాఫిక్ పోలీసులు ఆపివేశారు. దీంతో మధ్యాహ్నం 12 గంటల వరకూ సుమారు 20 లారీలు నిలిచిపోయాయి. గతంలో మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉండేవి. ఇప్పుడు మరింత సమయం పెంచడంతో వ్యాపారాలు మూసుకోవాల్సి వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీ యజమానులు సైతం గంటల తరబడి లారీలను నిలుపదల చేస్తే డ్రైవర్లు, క్లీనర్లుకు జీతాలు ఎలా చెల్లించాలంటున్నారు. కానీ ట్రాఫిక్ పోలీసులు మాత్రం ట్రాఫిక్ ఆంక్షలను తప్పనిసరిగా పాటించి తీరాల్సిందేనని చెబుతున్నారు. చివరకు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ట్రాఫిక్ పోలీసులు ఆ లారీలకు జరిమానా విధించి ఎస్‌వీ జనరల్ మార్కెట్ లోకి వదిలారు.


హండ్రెడ్ ఫీట్ రోడ్డులో లారీలను ఆపి వేసిన ట్రాఫిక్ పోలీసులు